www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 జులై 2024

5



నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రావులపాలెంలో సత్యసాయి సేవా సంస్థలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు మ న్యం వర్ధనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, సుగర్, గ్యాస్ట్రిక్, జనరల్ వ్యాధుల వైద్య సేవా శిబిరం, హోమియో ప్రత్యేక వైద్య నిపుణులు అమలాపురం, శ్రీ హోమియో ఆసుపత్రి వైద్యులు నాగులపల్లి శ్రీనివాస్ ఉచిత హోమియో వైద్యసేవలు అందించనున్నారు. రావులపాలెం, భవానీ హాస్పిటల్ వైద్యులు ఎం.భీమారెడ్డి ప్రముఖ లాప్రోస్కోపిక్ ప్రత్యేక వైద్య నిపుణులు, కొత్తపేట, శ్రీరామ నర్సింగ్ హోమ్ వైద్యులు సత్యవరపు విశ్వనాథ్ గుండె, సుగర్, గ్యాస్ట్రిక్, జనరల్ వ్యాధుల వైద్య సేవలు అందించనున్నారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి బిపి, ఇసిజి, సుగరు పరీక్షలు ఉచితముగా చేసి మందులు అందజేస్తామని తెలిపారు.

వర్మకు మొండి చేయేనా?

ఎంఎల్‌సిగా దక్కని అవకాశం
వర్మ వర్గీయుల్లో అసంతృప్తి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సాధారణ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ కోసం టికెట్‌ను త్యాగం చేసిన టిడిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ పరిస్థితి నేడు డోలాయమానంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్నందుకు ఆయనకు తొలి విడతలోనే ఎంఎల్‌సి పదవి వరిస్తుందని అంతా ఆశించారు. వర్మ అభిమానులు ఈ మేరకు ప్రచారం కూడా చేసుకున్నారు. రెండు మూడు సందర్భాల్లో వర్మను చట్టసభలకు పంపేలా కృషి చేస్తామని పవన్ కళ్యాణ్ సైతం చెప్పుకొచ్చారు. తాజాగా ఖాళీ అయిన రెండు శాసన మండలి స్థానాలకు ఎన్‌డిఎ కూటమి తరపున ఖరారు చేసిన అభ్యర్థుల్లో వర్మను పరిగణలోకి తీసుకోలేదు. రెండు సీట్లలో ఒకటి జనసేన నేత రాయలసీమకు చెందిన రామచంద్రయ్యకు, రెండోది పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్‌కు కేటాయించారు. ఇది పిఠాపురం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల నేపథ్యంలో మార్చి నుంచి రాజకీయం రసవత్తరంగా మారింది. తొలుత టిడిపి వర్సెస్ జనసేన అన్నట్టుగా పరిస్థితి కనిపించింది. కానీ అంతలోనే టిడిపి అధిష్టానం రంగంలోకి దిగింది. పార్టీ టికెట్ ఆశించిన వర్మను బుజ్జగించి పవన్ కళ్యాణ్‌కు మద్దతు ప్రకటించేలా చేయగలిగింది. ఎన్నికల ప్రచార సమయంలో, పోలింగ్ సమయంలోనూ ఇద్దరు కలిసిమెలిసి పనిచేశారు. ఫలితాలు వచ్చిన తర్వాత మాత్రం ఇరు శిబిరాల మధ్య వైరుధ్యం కనిపించింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో వర్మపై దాడి జరిగింది. ఈ దాడిపై భిన్న కథనాలు వినిపించాయి. ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఆశించినంత మెజారిటీ దక్కకపోవడం, ఎంపీ స్థానానికి పోటీ చేసిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కి వర్మ వర్గీయులు అందిగా నిలవలేదన్న అనుమానాల కారణంగా టిడిపి, జనసేన మధ్య విభేదాలు పెరిగాయి. వీటిపై టిడిపి అధిష్టానానికి జనసేన ముఖ్య నేతలు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం సాగింది. ఈ పరిణామాల నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో వర్మకు ఎంఎల్‌సి ఇస్తే ఆలోచన టిడిపి చేయడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో కొంత కాలం వర్మకు ఎదురుచూపులు తప్పేలా లేదు. ఈ పరిణామాలపై వర్మ వర్గం అసంతృప్తిగా ఉంది.

అధిష్టానమే గుర్తించాలి

చిత్తశుద్ధితో పార్టీ కోసం చేస్తున్న సేవలను అధిష్టానం గుర్తిస్తుందన్న నమ్మకంతో ఉన్నాను. ఆశకు గతంలో ఇచ్చిన హామీ విషయంలో అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ అభివృద్ధికి ఎంతగానో శ్రమించాను. పవన్ కళ్యాణ్ విజయం కోసం అహర్నిశలు పని చేశాను.

- వర్మ, మాజీ ఎంఎల్ఎ

నేడు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-అమలాపురం

విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణలో భాగంగా ఈ నెల 4న దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు పిలుపు ఇచ్చారు. బుధవారం అమలాపురం పట్టణం, ఇతర మండలాల్లో వివిధ విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా అమలాపురంలో స్థానిక వడ్డిగూడెంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.ప్రణీత్, కె.శంకర్ మాట్లాడుతూ మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో భాద్యతా రాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ నేపథ్యంలో నీట్ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యుజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని వారు తెలిపారు. ఉన్నత విద్య మాత్రమే కాక పాఠశాల విద్య పరిస్థితి కూడా దారుణంగా ఉన్నదని బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించబడినాపోయారు. 2018-19, 2021-22 మధ్య దేశంలో 61,885 పాఠశాలలను మూసివేశారన్నారు. దేశంలో విద్య ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా జులై 4న దేశవ్యాప్తంగా కెజి నుండి పిజి వరకు విద్యాసంస్థల బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపు ఇచ్చాయని తెలిపారు. ఈ బంద్‌లో అన్ని విద్యా సంస్థలూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఎన్‌టిఎ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, ముంబై ఐఐటి నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేత చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.



ఎస్‌కెబిఆర్ ప్రిన్సిపల్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకుడు

10న డిమాండ్స్ డే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

కార్మికుల హక్కులను సాధించడానికి ఈ నెల 10న చేపట్టిన డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపు ఇచ్చారు. అమలాపురంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, కోశాధికారి కృష్ణవేణి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూకల బలరామ్ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేశాయన్నారు. ప్రజలు కేంద్రంలోని బిజెపికి బలాన్ని బాగా తగ్గించారనీ, ఐదేళ్ల జరిగిన కార్మిక కర్షక ఉద్యమాల పోరాటాల ఫలితంగానే బిజెపి ఎంపీ స్థానాలు తగ్గాయని, చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు కేంద్రంలో బిజెపి ఇతరుల మద్దతు ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి వచ్చిందని చెప్పారు. కేంద్రంలో అధికారులకు వచ్చిన బిజెపి తన పాత విధానాల్ని కొనసాగించడానికే నిర్ణయించుకుందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పుడే చేయబోము అంటూనే ఒక పక్కన క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డితో ప్రైవేటీకరణ తప్పదని మాట్లాడిస్తున్నారన్నారు. ఎన్నికల అనంతరం లేబర్ కోడ్‌లను అమలు చేసే ఉత్తర్వులను జారీ చేయడానికి సిద్ధపడుతోందని తెలిపారు. లేబర్ కోడ్‌లు అమలు జరిగితే ఉన్న చట్టాల సారమంతా పోతుందని సమ్మెలు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. పని వేళలు పెంచడం, ఉన్న హక్కులు తొలగించడం, జీతాలు పెంచకపోవడం, నిర్బంధాన్ని తీవ్రతరం చేయటం యాజమాన్యానికి తేలిక అవుతుదన్నారు. దీనికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు చేయరాదని హెచ్చరించడానికి, కార్మిక హక్కులను సాధించడానికి డిమాండ్స్ డేని జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. పార్లమెంట్ నూ, బయట కార్మిక వర్గం పోరాటానికి ఇది అనుకూలమైన సమయం, దానికి సిద్ధపడాలని కార్మిక వర్గానికి సిఐటియు గా పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఇటీవల కృష్ణా జిల్లాలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఎస్.యానాంకు చెందిన ఇద్దరు మృతి చెందగా మృతుల కుటుంబాలను బుధవారం అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన రేవు భూషణం, పెసంగి కనకరాజు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ ఆనందరావు ఓదార్చి ధైర్యం చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ ఆనందరావు, అమలాపురం ఆర్‌డిఒ కె.కేశవర్ధన్ రెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. తహాశీల్దార్ టి.మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ లంకే భీమరాజు, మాజీ ఎంపిటిసి ఉలిశెట్టి దొరబాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, గ్రామ పెద్దలు దంగేటి చిట్టిబాబు, ఎ.రాజశేఖర్, పలచోళ్ల పద్మనాభం, అయితాబత్తుల అజయ్ సింగ్, పలచోళ్ల బుజ్జి పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు

మహాప్రస్థానం వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రతి మనిషీ పుట్టుకతో పాటు అంతిమయాత్ర కూడా గౌరవంగా సాగాలనే ఉద్దేశంతో జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో దాతలు ముందుకు వచ్చి మహాప్రస్థానం వాహనాన్ని దానం చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో దాతలు దానం చేసిన మహాప్రస్థానం వాహనాన్నికలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎంఎల్ఎ మాట్లాడుతూ మనిషి పుట్టుకతో పాటు చనిపోయిన తర్వాత అంతిమయాత్ర కూడా గౌరవంగా సాగాలనే ఉద్దేశంతో మహాప్రస్థానం వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు. రూ.16 లక్షల విలువైన మహాప్రస్థానం వాహన దాతలైన చెరుకూరి కష్ణంరాజు, పిన్నమరాజు కాశీ విశ్వనాథరాజు, సాగి వెంకట రామరాజులను కలెక్టర్, ఎంఎల్ఎ ఘనంగా సన్మానించారు. ఈ మహా ప్రస్థానం వాహనం అమలాపురం రెడ్ క్రాస్ కార్యాలయ అవరణంలో ఉంటుందని జిల్లా పరిధిలో మృతదేహాలను తరలించేందుకు వాహనం అవసరమైన వారు జిల్లా రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ ఫోన్ నంబర్ 9949294083 , 7396999946కు ఫోన్ చేసి వాహన సర్వీసులను ఉచితంగా పొందవచ్చని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కెఎస్.నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, మహాప్రస్థానం వాహన దాతలు చెరుకూరి కృష్ణంరాజు, పిన్నమరాజు కాశీ విశ్వనాథరాజు, సాగి వెంకటరామరాజు, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ డాక్టర్ పి.శర్మ, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ రత్న ప్రసాద్, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహాప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

కలెక్టర్‌ను కలసిన వేగుళ్ల లీలాకృష్ణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

భీమేశ్వర స్వామి ఆలయం పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ శ్రీభీమేశ్వర స్వామి శివలింగం మరమ్మత్తు పనులను కేంద్ర పురావస్తు శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. శివలింగం శిధిలావస్థకు చేరడంతో పాటు ఆలయంలో పలు మరమ్మతులను పురావస్తు శాఖ నెలరోజులుగా చేస్తుంది. మరమ్మత్తుల పనులు మరో 15 రోజుల వరకు కొనసాగుతాయని ఆ శాఖ ప్రకటించడంతో పనులను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నవరత్న కుమార్ పాఠక్, ఆర్కియాలజీ సూపరింటెంట్ గోపీనాథ్ జీవన, డిప్యూటీ సూపరింటెంట్ ఆర్కియాలజీ డాక్టర్ దేవేంద్రనాథ్ భాయ్, ఇంజనీర్ ఎబి.వర్మ, సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ కెవివిఎస్ఎన్ మూర్తి, ఆర్టికల్చరల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మహోత్, ఫోర్‌మెన్ పివి.రమణ తదితరులు ఆలయాన్ని సందర్శించి, పనులను పర్యవేక్షించారు. వారి వెంట ఆలయ పురోహితులు ఉన్నారు.

లాడ్జీల యజమానులతో డిఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని 14 లాడ్జీల ఓనర్లతో రామచంద్రపురం డిఎస్‌పి బి.రామకృష్ణ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. పలువులు యువకులు లాడ్జిలలో గదులు అద్దెకు తీసుకుని అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడుతున్నారని, గంజాయి తదితర మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని అటువంటి వారికి గదులు అద్దెకు ఇవ్వరాదన్నారు. వచ్చిన ప్రతి వారి వివరాలూ నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిఐ పి.దొరరాజు, రామచంద్రపురం ఎస్ఐ సురేష్ బాబు, ద్రాక్షారామం ఎస్ఐ సురేంద్ర, కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.



లాడ్జీల యజమానులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం రావులపాలెం మండలం లక్ష్మీ పోలవరం గ్రామానికి చెందిన కొప్పినీడి శ్రీనివాసరావు సత్య శ్రీ లక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు రూ. లక్షా 11 వేల 111 విరాళం అందించారు. ఆలయ డిసి రుద్రరాజు రమేష్ రాజు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నందున కృతజ్ఞతలు తెలిపారు.

ఆడిటోరియంను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు పట్టణంలోని 15వ వార్డులోని ఓపెన్ ఆడిటోరియంను మున్సిపల్ అధికారులకు బుధవారం పరిశీలించారు. ఆడిటోరియంను మినీ కల్యాణ మండపంగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించడంతో అంచనాలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఆడిటోరియం వద్ద కొలతలు వేయించి పలు సలహాలు సూచనలు చేశారు. ఇక్కడ మినీ కళ్యాణ్ మండపం ఏర్పాటు అయితే పెళ్లిళ్లకు పలు ఫంక్షన్లకు ఎంతో అనువుగా ఉంటుందని వారంతా అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా కేంద్రమైన అమలాపురంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు, కామన్ మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల నందరావుకు వినతిపత్రం అందించారు. బడుగు, బలహీన పేద వర్గాలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో నిన్న మొన్నటివరకు విద్యా రంగంలో ఆసరాగా ఉన్న ఎస్‌కెబిఆర్. ఎయిడెడ్ కళాశాల పూర్తి స్థాయిలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలగా మారిపోవడం గ్రామీణ విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఎంఎల్ఎ ఆనందరావుకు వివరించారు. అమలాపురం పరిసర ప్రాంత ప్రజలంతా ఎక్కువ వ్యవసాయ ఆధారిత పనుల మీద ఆధారపడినవారు.నిరక్షరాస్యత ఎక్కువగా ఉండే ప్రాంతం అన్నారు. ప్రభుత్వ కళాశాల లేకపోవడం వల్ల ప్రైవేట్ విద్యా సంస్థలలో రూ.35 వేలపైన ఫీజులు చెల్లించి చదవాల్సిన దీనావస్థలో ఈ ప్రాంత విద్యార్థుల పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదవాలంటే సుమారు 30 కిలోమీటర్ల పైన ప్రయాణించి ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట వెళ్ళి చదవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. ఈ విద్యా సంవత్సరం నుండి అమలాపురం కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్జెడి డాక్టర్ శోభారాణితో ఫోన్‌లో మాట్లాడి తక్షణం అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కామన్ మ్యాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి, పి.దుర్గాప్రసాద్, మధుర రాజు పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు, సభ్యులు

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని కాలేరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ దాయం కావేరి శేఖర్ బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సిబ్బంది పలు సూచన చేశారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, జెసిబి మిషన్ సాయంతో ట్రాక్టర్‌తో చెత్తను తొలగించారు. గ్రామ సభ నిర్వహించి ప్రజలు కావలసిన పనులపై చర్చించి తీర్మానాలు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చినబాబు, దేవి ప్రసన్న, వీఆర్ ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

కార్టూ'నిజం'



అన్నదాన నిధికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి : అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని బుధవారం హైదరాబాద్ యూసఫ్ గూడ వాస్తవ్యులు పేరిచర్ల సుబ్రహ్మణ్యం వర్మ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్య అన్నదాన నిధికి రూ.1,00,016 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రములతో సత్కరించి, చిత్రపటం బహూకరించారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్

ఆత్రేయపురం : మండల కేంద్రమైన ఆత్రేయపురం గ్రామానికి చెందిన విద్యార్థులు కిక్ బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. 36 కేజీల మ్యూజికల్ ఫామ్ ఏ భాగంలో తోటకూర నయన్ వర్మ గోల్డ్ మెడల్, క్రియేటివ్ పామ్ గోల్డ్ మెడల్ సాధించారు. 16 కేజీల విభాగంలో పాలపర్తి దీక్షిత రాజు మ్యూజికల్ ఫామ్‌లో గోల్డ్ మెడల్, క్రియేటివ్ ఫామ్ గోల్డ్ మెడల్ సాధించినట్టు కోచ్ టి.లక్ష్మీ సందీప్ కిరణ్ తెలిపారు ఈ సందర్భంగా రావులపాలెంలో మదర్ థెరెసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టారు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఆలమూరు

ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశ భ్రతపై మండలంలోని పినపళ్లలో సర్పంచ్ సంగీత సుభాష్ అధ్యక్షతన బుధవారం గ్రామస్తులు, పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో అవగాహనా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఒఎన్జిసి ఏరియా మేనేజర్ పి.జనార్ధన రావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ స్పందించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు వృద్ధి చెంది వివిధ రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రస్తుతం మహమ్మారిలా వ్యాపిస్తున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు సంయుక్తంగా కలసి పని చేయాలన్నారు. మన అందరి కృషి ఫలితంగా స్వచ్ఛ భారత్‌కు పునాదిగా రూపాంతరం చెందాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఒఎన్‌జిసి సింబల్‌తో ఉన్న చేతి గోనె సంచులు, టి షర్టులు, క్యాప్‌లు, అర కేజీ చొప్పున రాగుల ప్యాకెట్లు, డస్ట్ బిన్స్‌తో పాటుగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పి.పట్టాభిరామన్న, ఉప సర్పంచ్ యనమదల శ్రీను, కార్యదర్శి ఎస్.వీర్రాజు, ఒఎన్‌జిసి అధికారులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులు

మానికొండ సూర్యవతికి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

మహిళా సంఘం ఐద్వాలో కీలక పాత్ర పోషించిన మానికొండ సూర్యవతి వర్ధంతి సందర్భంగా బుధవారం అమలాపురం మెట్ల కాలనీలో ఆమెకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సూర్యవతి మహిళా సంఘానికి చేసిన సేవలు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నాగ వరలక్ష్మి మాట్లాడుతూ 1941లో మహిళా సంఘం కార్యదర్శిగా పనిచేశారని ఆమె ఊరూరా తిరుగుతూ మహిళలకు సభలు పెట్టడం సంఘ సభ్యులుగా చేర్పించడం స్త్రీల హక్కుల గురించి ప్రచారం చేయటం వంటి కార్యక్రమాలతో నిరంతరం మహిళలను చైతన్య పరుస్తూ ఉండేవారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టౌన్ కార్యదర్శి భువనేశ్వరి, ఎన్.కాంతమ్మ, పి.చెల్లాయమ్మ, జె.వీరలక్ష్మి ఐద్వా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సూర్యవతికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గండేపల్లి

కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయిన మహిళకు సంబంధించి ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పెదపూడి మండలం గండ్రేడు గ్రామానికి చెందిన సుంకర రామకృష్ణ, అతని భార్య సుంకర భవానీకి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ ఏడాది మే 6వ తేదీన ఇంట్లో జరిగిన గొడవల నేపథ్యంలో ఆమెను తన అత్తగారి నివాసం గండేపల్లిలో వదిలి వెళ్లానని, అదే నెల 8వ తేదీన అత్త ఇంటి నుంచి రెండేళ్ల కుమారుడిని వదిలి వెళ్లిపోయిందన్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆమె కోసం బంధువులు, ఇతర తెలిసిన వారిని వాకబు చేసినా, ఆమె ఆచూకీ తెలియ లేదని బుధవారం ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై ఉమెన్ హెచ్‌సి వెంకటలక్ష్మి కసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజవరం గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు పేరవరం శివారున ఉన్న గౌతమి పిరమిడ్ ధ్యాన మందిరానికి ఈ నెల 1న వెళ్లగా అక్కడ ఉన్న సంగిశెట్టి శ్రీనివాసరావు, శివాజీ మరికొంతమంది శ్రీనివాసరావుతో గొడవపడి దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారు. దాడిని వారించబోయిన మహిళలను దుర్భాషలాడి వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనిపై శ్రీనివాసరావు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈ నెల 24న మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుని రామచంద్రపురం పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపురం పట్టణంలో ఒక బాలికను ఈ నెల 24న కిడ్నాప్ చేసి హైదరాబాద్ తీసుకెళ్లి అమెను బల వంతంగా అక్కడ లాడ్జిలో అత్యాచారం చేసిన గుత్తుల సురేష్‌ను అరెస్టు చేసిశారు. కిడ్నాప్, అత్యాచారం, ఎస సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు డిఎస్‌పి బి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఎజెఎఫ్‌సిఎం కోర్టు లో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారని రామచంద్రపురం ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

దివాన్ చెరువు సెంటర్లో మంగళవారం రాత్రి లారీ ఢీ కొని ఒక వ్యక్తి మృతి చెందాడు. దీనిపై బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోకవరం మండలం తిరుమలాయపాలేనికి చెందిన పినమరెడ్డి కొండలరావు మంగళవారం పాలచర్ల నుంచి శ్రీరాపురం వైపు బైకుపై వెళ్తున్నాడు. దివాన్‌చెరువు సెంటర్‌కు వచ్చేసరికి విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండలరావు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యానాం వార్తలు



కేంద్రమంత్రితో ఎన్‌డిఎ కూటమి ఎంఎల్‌ఎలు

సిఎం రంగస్వామిపై కేంద్రానికి ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి సిఎం రంగస్వామిపై ఎన్‌డిఎ కూటమి ఎంఎల్‌ఎలు రాజ్యసభ సభ్యులు సెల్వ గణపతి ఆధ్వర్యంలో కేంద్రానికి ఫిర్యాదు చేశారు. బుధవారం పుదుచ్చేరి ఎంఎల్‌ఎల బృందం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్‌రామ్ మెగ్వాల్, బిజెపి ప్రెసిడెంట్ జెపి నడ్డాలను కలిసి ఫిర్యాదు చేశారు. పుదుచ్చేరిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయిందని, ఆ ప్రభుత్వంలో ముగ్గురు బిజెపి, మరో ముగ్గురు స్వతంత్ర, ఇద్దరు నామినేటెడ్ ఎంఎల్‌ఎలు ఉన్నారని, అయితే ఎంఎల్‌ఎలకు సిఎం రంగసామి నియోజవర్గ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. సిఎం రంగస్వామి ఏకపక్షంగా వ్యవహరి స్తున్నారని, ఎంఎల్‌ఎలకు ఇవ్వాల్సిన ప్రోటోకాల్‌ని సైతం పక్కదారి పట్టిస్తూ అవినీతిపరులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వంలో పనిచేయడం తమ వల్ల కాదని, దీనిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు ఎంఎల్‌ఎల బృందంలో ఉన్న యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గోవలంక సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో కనకాల పేట ఏటిగట్టు మార్గంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్ళరేవు మండలం గోవలంక గ్రామ సర్పంచ్ సింహాద్రమ్మ భర్త కోరుకొండ సూరిబాబు (55) మృతి చెందారు. ట్రాక్టర్ బోనట్ పై కూర్చుని సూరిబాబు ఫోన్ మాట్లాడుతుండగా యానాం నుంచి కోటిపల్లి వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృత దేహానిక్న యానాం జిజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు

శ్రీరాంపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలానికి చెందిన శ్రీరాంపురం గ్రామంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలగంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన కిరణ్ కంటి ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, సీతయ్య కాపు, పి.శివాజీ, ఎం.సునీల్, కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్య, ప్రోగ్రాం మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ



వివిధ విభాగాల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు

సీజనల్ వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ జె..వెంకటరావు ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరిచే క్రమంలో వాహనాలు, డంపర్ బిన్ల మరమ్మతులతోపాటు, అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. సర్కిల్ వారిగా జరుగుతున్న పూడ కతీత పనులు ఎక్కడైనా అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో ముంపునీటి సమస్య ఎదురు కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్వర్టును పరిశుభ్రం చేసే అంశంపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్ ప్రక్రియ, డ్రెయిన్లలో దోమల నియంత్రణ మందులు చల్లడం, ఖాళీ స్థలాల్లో డ్రోన్ పరికరాల ద్వారా దోమల నియంత్రణకు చర్యలపై చర్చించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉంటే ప్రజలను అప్రవ ుత్తం చేయడంతోపాటు అవసరమైన సేవలు అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ నాగ నరసింహరావు, ఎస్ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకటరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఇఇ మాధవి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఎసిపి నాగశాస్త్రులు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డుపై శేషారెడ్డి హర్షం

ప్రజాశక్తి - సామర్లకోట



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపల్ వందనా భోప్రా

మండలంలోని ఉండూరులో ఉన్న శ్రీ లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ వందనా బోప్రా కు వివేకానంద నేషనల్ ప్రిన్సిపల్ అవార్డు రావడం పట్ల ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత నెల 29న హైదరాబాద్‌లో స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ కాన్క్లేవ్ అవార్డ్ ఫంక్షన్ జరిగిందన్నారు. ఆ ఫంక్షన్‌లో సుమారు 500 పాఠశాలు పాల్గొన్నాయని, పాఠశాల ప్రిన్సిపల్ విభాగంలో తమ పాఠశాలకు జాతీయ స్థాయి అవార్డు రావడం జరిగిందన్నారు. కృషి, పట్టుదల, నిబద్ధత, వినూత్న విధానం, సృజనాత్మకమైన ఆలోచన, జట్టు నాయకురాలుగా ముందుండి నడిపించడంలో ఆమె అసాధారణ నైపుణ్యాలకు గుర్తుగా ఈ అవార్డ్ వచ్చిందని శేషారెడ్డి అన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యా ప్రణాళిక సాధనలో శ్రేష్టత మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం చేసే ప్రయత్నంలో ఆమె అంకిత భావాన్ని ఈ అవార్డు తేటతెల్లం చేస్తుందన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు వాటర్ బాటిల్స్ అందిస్తున్న శ్రీనివాస్

శ్రీనివాస్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాయి తేజ స్కూల్ కరస్పాండెంట్ బోనం శ్రీనివాస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. బుధవారం పటవల పంచాయతీ పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాలకు శ్రీనివాస్ మినరల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ప్రతిరోజు ఆ కేంద్రాలకు మినరల్ తాగునీరు సరఫరా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయుడు గంగాధర్, అత్తిలి బాబురావు, ముత్యాల జయలక్ష్మి, వేగి ప్రసాద్, భజన సత్తిబాబు,ఉప సర్పంచ్ చక్కపల్లి లక్ష్మణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కరప

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఐసిడిఎస్ సిడిపిఓ వై.లక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక చంద్రన్న సమావేశ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న ఆటపాటలతో కూడిన విద్య బోధన, పౌష్టిక ఆహారం, సౌకర్యాలను వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ మాట్లాడుతూ పిల్లలకు జీవితంలో గుర్తుండిపోయేలా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంఇఒ కెబి.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బోగిరెడ్డి కొండబాబు, పేకెటి ప్రసాద్, సైనావరపు భవాని శంకర్, యాళ్ల సత్యనారాయణ, పేపకాయల పవన్‌కుమార్, పి రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.వీరవేణి, ఎం.వరలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పెద్దాపురం పద్మనాభ కాలనీకి చెందిన యాళ్ల గుణ కుటుంబానికి మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు చేతులు మీదుగా నిత్యావసర సరుకులు, రూ.6 వేలు నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, టిడిపి పట్టణ కార్యదర్శి తూతిక రాజు, ఆరిప్ ఆలీ, కురం దాసు గణేష్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వదినాల్లో ఒక మొక్క నాటండి

ప్రజాశక్తి - సామర్లకోట

సమాజంలో ప్రతీ ఒక్కరు వారి గృహాల్లో జరిగే పర్వదినాల్లో ఒక మొక్కను నాటడం అలవాటుగా తీసుకోవాలని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రసన్నాంజనేయ నగర్ కాలనీలో గంగాధర్ పుట్టిన రోజు సందర్భంగా తన ఇంటి వద్ద మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ తమ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు తదితర పర్వదినాలను పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఎలక్ట్రికల్ ఇంజనీర్ పెంటకోట గంగాధర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ డి.శివప్రసాద్, బాల గణితావధాని, టి.సాయివంశీ పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పక్షవాతంతో నిస్సాహయ స్థితిలో ఉన్న స్నేహితునికి ఆర్థిక సాయం అందించి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. కాజులూరు మండలం మంజేరు గ్రామానికి చెందిన గండి అప్పారావు సుమారు 8 నెలల కితం బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం పాలయ్యాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న అప్పారావు స్నేహితుడు పటవల సాయితేజ స్కూల్ కరెస్పాండెంట్ బోనం శ్రీనివాసరావు రూ.10 వేలు, మరో మిత్రుడు కోసూరి రామారావు రూ.3 వేలు కలిపి బుధవారం అందచేశారు. కౌలు రైతుగా జీవనం సాగిస్తూ మంచాన పడ్డా అప్పారావు కుటుంబానికి మరింతమంది సాయం అందించాలని బోనం శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, నాయకులు రాయుడు గంగాధర్, కుడిపూడి శివన్నారాయణ, అత్తిలి బాబూరావు, భజన సత్తిబాబు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

గర్భిణులు, వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం గ్రూప్ మాతత్వం పేరుతో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న గర్భిణులు వృద్ధులకు అన్నదానం బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. ఈ సందర్భంగా 130 మంది గర్భిణులు, 80 మంది వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన జంగారెడ్డి గంగాధర్ ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దస్తావేజు పడిపోయినది

జగ్గంపేట మండలం, రామవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సామ్సన్, తండ్రి: చంద్రరావు అను వ్యక్తికి చెందిన రామవరం గ్రామానికి చెందిన సర్వే నెం. 311-1లో 0.011-2 జిరాయితీ భూమికి సంబంధించి దస్తావేజు నెంబర్ 98-1983 ఒరిజినల్ దస్తావేజు జగ్గంపేట స్టేట్ బ్యాంక్‌లో లోన్ పెట్టి తిరిగి రామవరం వెళ్ళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియపరచగలరు.

కొప్పిశెట్టి సామ్సన్
తండ్రి: చంద్రరావు, రామవరం, జగ్గంపేట
సెల్: 9705625122

Notice under Order 34, Rule 5 CPC

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
F.D.P. 642/2023
O.S. 72/2018

Between:
పెరుమళ్ళ సత్యనారాయణ -పిటీషనరు
AND
యలమర్తి శ్రీనివాసు, S/o. గౌతమ్, వయస్సు 42, మెయిన్‌రోడ్డు, ఆలమూరు. -రెస్పాండెంటు

పై గ్రంథములో రెస్పాండెంటుకి ఎన్నిసార్లు నోటీసు పంపించినను Evade చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము తెలియచేయునది ఏమనగా, పై గ్రంథము పై కోర్టులో రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది. 22-7-2024 కి వాయిదా వేసినారు.** పైన పేర్కొన్న తేదీన రెస్పాండెంటు పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 ని॥లు** లగాయితు హాజరు కావలెను. లేనిచో పరోక్ష తీర్మానము కాబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(By Order of Court)
రామచంద్రపురం T.VIJAY KUMAR
ది.28-6-2024 S.V.S.N.MURTHY
Advocates, Alamuru

ప్రకటన

In the Court of the Civil Judge (Junior Division), Anaparthi
O.S. No. 124/2023

Plaintiff: Tadi Subha Sri
AND
Defendant: Anupoju Durga, D/o. Suri Babu, Door No. 4-504, Devi Gudi Veedhi, Markandeyapuram, Anaparthi - 533342.

ప్రతివాది తన తాలూకు అనపర్తిలోని ఆర్.ఎస్. నెం. 290/2లో 142 చ॥గ॥ స్థలము అందులోని డోర్ నెం. 4-653 గల Manglore Tiled House ను హామీ యిచ్చి వాది వద్ద తీసుకున్న రూ. 10,000,00-00 వడ్డీన్ని యివ్వవలసినదిగా Preliminary Decree Grant చేయమని పై నెంబరు దావా దాఖలు చేయగా ప్రతివాది దావా సమన్లు తీసుకోకుండా Evade చేయుచున్నందున ప్రతివాది Appearance నిమిత్తం ది. 13-8-2024 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరు కాని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

KONALA SRIDHAR REDDY
Anaparthi Advocate, Anaparthi
Dt.29-6-2024 Cell: 9949863839

అధికారుల తీరుపై ఎంఎల్‌ఎ చినరాజప్ప ఆగ్రహం

ప్రజాశక్తి - సామర్లకోట

మండల అధికారుల తీరుపై ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు, కొందరు అధికారుల వల్లే అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆయన మండిపడ్డారు. పనిచేయలేని అధికారులు వెళ్లిపోవచ్చునని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతి నిధులందరూ బాధ్యతాయుతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో, తాడేపల్లిగూడెం
I.A. 584/23, O.S. 80/2016

Between:
భీముని వెంకటరమణ, వగైరాలు -పిటిషనర్స్
మరియు
కరణం అప్పారావు వగైరాలు -రెస్పాండెంట్స్

R-10: పంతం నాగలక్ష్మి, D/o. శ్రీనివాసు, వయస్సు 35 సం॥లు, లలిత కాంప్లెక్స్, మెయిన్ బజార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ రోడ్, పిఠాపురం.

R-11: పంతం సూర్యప్రకాశ్, S/o. శ్రీనివాస్, వయస్సు 33 సం॥లు, లలిత కాంప్లెక్స్, మెయిన్ బజార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ రోడ్, పిఠాపురం.

పై నెంబరు గల పిటిషన్‌లో పిటిషనర్, రెస్పాండెంట్స్ అయిన మీరు R10, R11 కి ఎన్నిమార్లు పిటిషన్ నోటీసులు మీకు పంపిన అమలు కాని కారణంగా శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా మీకు అమలుచేసే విధముగా పిటిషనర్ ఆర్డరు పొంది ఉన్నారు. కావున **వాయిదా తేది 12-7-2024 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్ తదుపరి చర్యలు జరుపబడును.

వాయిదా తేది: 12-7-2024

జి.వి.నాగేశ్వరరావు
జి.లక్ష్మయ్య
యమ్.శ్రీనుబాబు
తాడేపల్లిగూడెం న్యాయవాదులు, ఏలూరు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో

I.A. No. 458/2023, I.A. No. 459/2023
I.A. 460/2023 in O.S. No. 16/2018

Between:
1) కోలా ప్రసాద్ @ శ్రీరామమూర్తి -పిటీషనర్/ వాది
AND
జగడం వెంకటేశ్వరరావు వగైరా -రెస్పాండెంట్స్/ ప్రతివాద్దు

R-4: జగడం లోవరాజు, S/o. నూకరాజు, కొమరగిరి, ఐ.పోలవరం మండలం.

ఈ పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన జగడం నూకరాజు గారి వారసుడుగా మిమ్మల్ని 4వ ప్రతివాదిగా దావాలో జాయిన్ చేయుటకు అనుమతి ఇప్పించమని సదరు పిటీషన్‌ని దాఖలు చేయుటకు అయిన ఆలస్యంను మన్నించమని మరియు దావాలో 2వ ప్రతివాదిపై ఏదైనా Abatment Order జారీ చేసినట్లు అయితే సదరు ఆర్డర్‌ను Set a side చేయించమని మున్నగు పరిహారములు కోరుచూ మీపైన సదరు కేసులో I.A. No. 458/2023, I.A. No. 459/2023 మరియు I.A. No. 460/2023 పిటీషన్లు దాఖలు చేయగా సదరు పిటీషన్‌లలో మీ హాజరు నిమిత్తం మరియు మీకు నోటీసులు అమలు నిమిత్తం వాయిదా **ది. 09-7-2024వ తేదీ అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెనన్నీ, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానించబడునన్నీ ఇందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్: 9440041751
ది.02-7-2024 9440528135

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో

I.A. No. 336/2024, I.A. No. 337/2024
I.A. 338/2024 in O.S. No. 16/2018

Between:
1) కోలా ప్రసాద్ @ శ్రీరామమూర్తి (died)
2) కోలా జీవన్‌కుమార్
3) కోలా రత్నకుమారి
4) నేలపూడి సంధ్యారాణి
-పిటీషనర్స్/ *Proposed Plaintiffs 2 to 4*
AND
జగడం వెంకటేశ్వరరావు వగైరా -రెస్పాండెంట్స్/ ప్రతివాద్దు

R-4: జగడం లోవరాజు, S/o. నూకరాజు, కొమరగిరి గ్రామం, ఐ.పోలవరం మండలం.

ఈ పై నెంబరు దావాలో వాది గారు అయిన కోలా ప్రసాద్ చనిపోయినందున అతని వారసులుగా 2 నుండి 4 పిటీషనర్స్‌ని దావాలో జాయిన్ అవ్వడాన్ని అనుమతి కోరుతూ మరియు సదరు పిటీషన్ దాఖలు చేయడానికి అయిన ఆలస్యంను మన్నించమని మరియు దావాలో ఏదైనా Abatment Order ఏదైనా ఉంటే సదరు ఆర్డర్‌ను Set a side చేయించమని మున్నగు పరిహారములు కోరుచూ I.A. No. 336/2024, I.A. No. 337/2024 మరియు I.A. No. 338/2024 అను మూడు పిటీషన్లు దాఖలు చేసి సదరు పిటీషన్‌లలో మీకు నోటీసులు అమలు నిమిత్తం మీ హాజరు నిమిత్తం వాయిదా **ది. 09-7-2024వ తేదీ అయివున్నది. కావున వాయిదా తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెనన్నీ, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానించబడునన్నీ ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్: 9440041751
ది.02-7-2024 9440528135

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని మెర్లపాలెం నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి, వివాకానందుని వర్థంతి సందర్భంగా వారి వేషధారణలో చిన్నారులు మిద్దె దివ్యశ్రీ, చిన్నం శైలజ చేసిన నేను బడికి పోతా ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ అల్లూరి, వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు.

భాధితునికి సర్పంచ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల మండలంలోని నర్సిపూడికి చెందిన కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. గ్రామస్తులతో పాటు, చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పలువురు దాతలు ఆర్థిక సాయం చేశారు. విషయం తెలుసుకున్న గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు బాధితుని ఇంటికి వెళ్లి రూ.5000 నగదుతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు.

పింఛన్ల పెంపునకు కృష్ణ మాదిగ కృషి

ప్రజాశక్తి -మామిడికుదురు

వికలాంగుల పింఛను రెట్టింపు చేసేందుకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అందించిన సహకారం మరువరానిదని ఎంఆర్‌పిఎస్ నేత నూటికుర్తి సత్యనారాయణ అన్నారు. మామిడికుదురు ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో వికలాంగుల హక్కుల పోరాట సమితి పర్యవేక్షణలో మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కేత శ్రీనివాస్, కొమ్ముల కోటేశ్వరరావు, గెద్దాడ మహాలక్ష్మి, మానుపాటి సత్తిపండు, బత్తుల శేఖర్, కటకంశెట్టి కృష్ణాజీ, జనసేన నాయకులు ఇంటి మహేంద్ర పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి : సువర్ణరాజు

ప్రజాశక్తి - గోపాలపురం

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. బుధవారం హుకుంపేటలో కూటమి విజయం నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో తేనేటి విందును నిర్వహించారు. తొలుత హుకుంపేట జమిందార్ రాజాబాబును సత్కరించారు. ఆయన చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. నియోజకవర్గంలో పార్టీ విజయానికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం రాజబాబు మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాట్నం గణేష్, పి.రాంబాబు, గణపతి, ఫణి, సూర్య భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

అమలాపురం రూరల్: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అమలాపురం రూరల్ సిఐ పూడి వీరబాబు, సిడిపిఒ విజయకుమారి అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రూరల్ సిఐ కార్యాలయ ఆవరణలో సిఐ వీరబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అమలాపురం ఆదిత్య పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్ బాబు, సూపర్వైజర్ లీలాకుమారి, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

కడియం :వివిధ శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో కూటమి నాయకులు, సచివాలయ, పంచా యతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమన్వయ కమిటీ సమావేశం ఎంపిపి అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత ఇఒపిఆర్‌డి విక్టర్‌బాబు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 7గంటల్లోపు గ్రామాల్లో శానిటేషన్ చేయించాలన్నారు. డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకుని, టైమ్ ప్రకారం గార్బేజ్ కు తరలించాలని సూచించారు. ఎంపిడిఒ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్, విలేజ్ ప్రొఫైల్‌ని ప్రతి పంచాయతీ కార్యదర్శి తయారు చేసుకోవాలన్నారు. ఫండ్స్ నిల్వ, గ్రామానికి కావల్సిన అవసరాలు, వాటికి అవసరమగు నగదు, శాఖల వారీగా సమస్యలపై ఈ యాక్షన్ ప్లాన్ ఉండాలన్నారు. గ్రీవెన్స్‌కి సంబంధించిన రిజిస్టర్లను ప్రతి సచివాలయంలో నిర్వహించా లన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పైప్ లైన్ లీకులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. క్లోరినేషన్ చేయించాలని, వాటర్ టెస్టింగ్ చేయించాలని తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులకు అందు బాటులో ఉండాలన్నారు. సదరం సైట్ ఓపెన్ అవుతుందని, ఈ విషయాన్ని వికలాంగులకు తెలియజేయాలన్నారు. పింఛన్లకి అర్హులైన వారి జాబితాను తయారు చేసుకోవాలన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ప్రసాద్

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా కార్యాలయంలో ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న జెడివి ప్రసాద్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపిడిఒ కె.నరేందర్‌రెడ్డి వ్యక్తిగత కారణాలపై సెలవుపై వెళ్లారు. దీంతో ప్రసాద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ కష్టాలపై డిఇకి బిఎస్‌పి వినతి

ప్రజాశక్తి - ఆలమూరు



వినతిపత్రం అందిస్తున్న బిఎస్‌పి నాయకులు

మండలంలోని వివిధ గ్రామాల్లో తరచూ కరెంటు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇందులో భాగంగా చెముడులంకలో ఎస్‌సి కాలనీ, ఎస్‌బిఐ ఏరియా, శ్రీనివాస్ నగర్ కాలనీ, గాంధీ నగర్ ఏరియాలలో సుమారు 5 ఏళ్లుగా వోల్టేజ్ హెచ్చుతగ్గులతో కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించి క్రింది స్థాయి అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు సమస్య పరిష్కారం కోసం బహుజన్ సమాజ్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రపు కొత్తియ్య ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రపురం విద్యుత్ శాఖ డిఇ వై.విజయానంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు జి.శ్రీను, బద్ద బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయం, కొవ్వూరు

ఆర్.ఓ.సి.నెం. 10(3)/2024/ఇ1 తేది.03-07-2024

ఇ-ప్రొక్యూరుమెంట్ టెండరు నోటీసు

కొవ్వూరు పురపాలక సంఘ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో మొత్తము రూ. 55.21 లక్షల విలువ గల (7) పనులు చేయుటకు టెండర్లను ఇ-ప్రొక్యూరుమెంట్ ప్లాట్ ఫామ్ ద్వారా ప్రకటించబడినది. వివరములకు http://tender.e-procurement.gov.in దర్శించండి.

1) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు	: తేది.03-07-2024న సాయంత్రం గం॥ 5.30ల నుండి
2) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ముగింపు	: తేది.20-07-2024న సాయంత్రం గం॥ 4.00 వరకు
3) టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు	: తేది.20-07-2024న సాయంత్రం గం॥ 4.30 వరకు
4) టెండర్లు తెరచుట	: తేది.20-07-2024న సాయంత్రం గం॥ 6.00ల నుండి

సం/- **కె.డానియల్ జోసఫ్**
కమిషనరు, కొవ్వూరు పురపాలక సంఘము